


# మంచిమార్గం

రాజయ్య భూషయ్య ఒకే వీధిలో ఉంటారు.

ఒకనాటి సాయంకాలం రాజయ్య సంత వీధిలోంచి వస్తుంటే విచారంగా వున్న భూషయ్య కనిపించాడు. రాజయ్య 'విషయమేంటని' అడిగాడు.

'మా అబ్బాయి అవలీలగా అబద్ధాలు చెప్పేస్తున్నాడు. బడికెళ్ళకుండానే వెళ్ళానని, అమ్మ అడిగిందని నన్ను, నేను అడిగానని వాళ్ళమ్మని డబ్బులడిగి ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెడుతున్నాడు. 'ఎందుకలా చేస్తున్నావని' అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నాడు. ఒక్కగానొక్క కొడుకు పాడైపోతున్నాడని మనసులో మదన పడిపోతున్నాను' చెప్పాడు భూషయ్య.

'భూషయ్యా, నేను నీకో విషయం చెప్పాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. ఇప్పుడు సరైన సమయం వచ్చింది. అబద్ధం ఆడే అలవాటు నీకు మాత్రం లేదా, నిజాయితీగా చెప్పు. నువ్వు అప్పులు చేస్తావని, వసూలు చేసుకోవడానికి నీ ఇంటికొచ్చేవాళ్ళకి రకరకాల సాకులు, అబద్ధాలు చెబుతావని అందరూ అనుకోవడం చాలాసార్లు విన్నాను. నీ ప్రభావం నీ పిల్లాడి మీద పడడంలో వింతేముంది. పెద్దల్ని బట్టే కదా పిల్లలు. నువ్వు అబద్ధాలు ఆడేటప్పుడు నీ పిల్లాడు నిన్ను గమనిస్తున్నాడని బహుశా నువ్వు అనుకుని వుండవు. అదే ఇంత వరకు తెచ్చింది. అబద్ధాలు ఆడేవాళ్ళని సమాజం చిన్నచూపు చూస్తుంది. నమ్మకస్తులవైపే వుంటుంది. చిన్నపిల్లాడైన నీ కొడుకువల్ల నీలో ఇంత మనస్థాపం కలిగితే! రేపు వాడు పెరిగి పెద్దయ్యాక సంఘానికి ఎంత క్షోభ కలిగిస్తాడు? చిన్న పిల్లల పాలన పోషణలో అందుకే

క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ రంగరించాలి. అప్పుడే వాళ్ళు ఆదర్శవంతంగా ఎదుగుతారు. పెద్దలకి పేరు ప్రతిష్టలు తీసుకువస్తారు. నువ్వు సరైన సమయంలో కళ్ళు తెరవడం మంచిదయింది. లేకపోతే మరింత పతనమయ్యేవాడు. రేపటి నుండి వాడిని నా దగ్గరకు పంపు. మంచి మార్గంలో పెట్టడానికి నా ప్రయత్నం నేను చేస్తాను.

భూషయ్య 'సరే' అన్నట్టుగా తలూపాడు. మనసులోని భారం తీరిన ఆనందంతో. - ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

## కారకోరం పర్వత శ్రేణిలో గల ప్రపంచంలో రెండవ ఎత్తైన శిఖరం

ప్రపంచంలోనే పొడవైన పర్వతశ్రేణి కారకోరం. ఇందులోని శిఖరాలలో కారకోరంలో 60కి పైగా 7000 మీటర్ల ఎత్తైన శిఖరాలు ఉన్నాయి. 166 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉండే ఈ పర్వతశ్రేణిలో కె2 శిఖరం ఎవరెస్టు శిఖరం తరువాత ఎత్తైనది. ఇది రాతి గుమ్మటంలా ఉండి నునుపుదేలి అధిరోహణకు వీలుకాదు. పాకిస్తాన్, ఇండియా, చైనాలకు సరిహద్దుల్లో ఉండే ఈ శిఖరం పాకిస్తాన్ బాల్టిలోని స్కర్టూ నుండి మాత్రమే ఇది ఎక్కటానికి కొంత వీలు ఉంటుంది. 8,611 మీటర్ల ఎత్తుండే ఈ శిఖరం దిగువకు 4 కి.మీ. వరకు వాలుగా ఉంటుంది. అంతేకాక తీవ్రమైన గాలులు, మంచు ముక్కలు విరిగిపడటం జరుగుతాయి. స్కర్టూ నుండి 8 గంటల ప్రయాసతో కూడిన ప్రయాణంతో లోయలు, మంచు కొండలు దాటి బోట్టోరో మంచుశ్రేణి పర్వతశిఖరాలు దాటి కొంకొర్డియో చేరగలం. ఇది మూడువైపుల మంచుతో నిండిన 8000 మీటర్ల ఎత్తైన శిఖరాలకు కూడలి. దీని చుట్టూ 7000 మీటర్ల శిఖరాలు ఎన్నో కనిపిస్తాయి. అయితే అన్నిటి కన్నా ఇది ఎత్తుగా ఉండి దేవతల సింహాసనంగా పిలువబడుతుంది. •

సేకరణ : కె. మేరీ గ్రేస్, చిలకలూరిపేట